# చేబదులు కోసం

ఉద్యోగం చేస్తున్నవాణ్ణి, ప్రస్తుతం డబ్బులేనివాణ్ణి నడుస్తున్నాను.

'ఎందుకు? ఎక్కడికి?'

'జేబులో రెండు చెల్లనిపావలా లున్నాయి. అవి ఒక పావలాకి మార్చవచ్చు' అందుకు.

'ఎక్కడికి?'

'అవి మారేచోటుకు.'

'ఎన్నిచోట్ల ప్రయత్నించేను'!

'ఇప్పటికి అరుచోట్ల.'

'ఏ యే చోట్ల?'

'ట్రాముల్లైను ప్రక్కనున్న కిళ్లీలదుకాణంలో దాని ప్రక్కనున్న బేకరీలో, దాని ప్రక్కనున్న లాండ్రీలో, దాని తరవాత ఉన్న క్షౌరశాలలో, దానిప్రక్కనున్న పళ్ళదుకాణంలో.'

'ఆ తరువాత?'

'ఒక సందు.'

'అప్పు డేమిటి చేశావు?'

'సందులోకి వెళ్ళలేదు.'

'వెళ్ళక?

'సందుకి అటువేపు ఉన్న దుకాణాలకి వెళ్ళాను. ఈ దుకాణాలు ఎటువేపుఉన్నాయి. కుడిపక్కా, ఎడంపక్కా

ఇప్పుడు ప్రస్తుతం దిక్కులు తెలీవు. ప్రయత్నించి ఎలాగైనా చెప్పాలి. అవును. దుకాణాలవైపు ముఖంపెట్టే నా కుడిచేతి వైపు ఇంతకుముందు చెప్పిన అంగళ్ళు ఉన్నాయి. దుకాణాలవైపు వీపుపెట్టే నా కుడిచేతిపక్క తరవాత చెప్పబోయేవి ఉన్నాయి.'

'తరవాత ఏవేవి చూశాను?'

'ఒక తాంబ్రేలు కొట్టు. దానిపక్క డబ్బా టీ దుకాణం.'

'నా ప్రయత్నం కొనసాగిందా?'

'లేదు.'

'ఆ దుకాణదారులు నాగురించి ఏమనుకొంటూ ఉంటారు?'

'వీడో పచ్చి దగుల్బాజీ. డబ్బులేనివాడు. ఎక్కడో రెండు పావలాలు సంపాదించాడు. మార్చుకొని యింత తిండి తింటాడు.'

'ఈ అభిప్రాయాలకి ఆధారాలు ఉన్నాయా?'

'ఊఁ!'

'ఏమిటి?'

'ఒకటి నారూపు, రెండు నామాటలు, మూడు ప్రవర్తన.'

'రూపు ఎలా ఉంది?'

'కొంచెం మాసిన గెడ్డం. ఆకలితో బాధపడుతున్న కళేబరం. జాలిగా ప్రాణం. అలుగ్గుడ్డల్లాంటి బట్టలు. మాట

లలో ప్రార్థేయపడడం. తడుపుకోడం. భాష సమంగా రాక పోవడం.'

'ప్రవర్తన?'

'ఏమో!'

'అవుతే మరేం చేశాను?'

'ఏదో చోట ప్రయత్నించేను.'

'సఫలమైందా?'

'ఊఁ'

'ఇదెక్కడ?'

'ఒక కాఫీకొట్లో.'

'ఎందువల్ల?'

'ఈ కాఫీహోటల్లో చాలాసార్లు నేను కాఫీతాగుతూ ఉండడంవల్ల.'

'ఎలా నచ్చచెప్పాను? పర్సుపోయింది అని, జేబులో ఈ పావలా లున్నాయని, అంతదాకా ఈ రెండూ ఉంచుకొని ఓ పావలాఇస్తే రూముకివెళ్ళి డబ్బు తెచ్చుకొని మళ్ళీ ఇవి తీసుకుంటానని.'

'నమ్మాడా?'

'ఊఁ!'

'ఉద్యోగం చేస్తున్నవాణ్ణి. ప్రస్తుతం డబ్బు (ఒక పావలా) గలవాణ్ణి. అణాపెట్టి అరకప్పు కాఫీ తాగేను. అణాపెట్టి రెండు విల్సుసిగరెట్లు కొన్నాను. సిగరెట్టు కాలుస్తూ నడుస్తున్నాను.'

'ఎక్కడికి?'

'బస్సెక్కేందుకి'

'ఆఁ, అయితే ఇదంతా ఏవూళ్ళో?'

'ఒకానొక నగరంలో. బస్సుకోసం నిరీక్షిస్తున్నా.'

'బస్సు వచ్చిందా?'

'రాలేదు. సిగరెట్టు పారేశాను. దిక్కులు చూస్తున్నాను. ఆలోచిస్తున్నాను.'

'ఏమని?'

'.........'

'బస్సు రాలేదు. విసిగిపోయి రెండో సిగరెట్టు ముట్టించేను. బస్సు వచ్చింది. ఎక్కాను. కండక్టరు సిగరెట్టు కాల్చకూడదు. ఆర్పు అన్నాడు. బస్సు దిగిపోయేను. ట్రాముకోసం కాచుకూర్చున్నా. లేదు. కాచుకొని నిలుచున్నా. సిగరెట్టు ఆరిపోయింది. ట్రాం వచ్చింది. ఎక్కేను.'

'ట్రాములో తెలిసిన మొగాలు ఉన్నాయా?'

'ఊఁ.'

'ఎవరు?'

'ట్రాం మోటారుమేన్. కండక్టర్లలో ఒకడు.'

'పిల్లా? పాసింజర్లలో?'

'ఒక్కడూ లేడు.'

'టిక్కెట్టు కొన్నావా?'

'ఊఁ.'

'ఎంత అయింది?'

'ఏడుకాన్లు.'

'అసలు ముందు కొనదలుచుకున్నావా?'

'ఊఁ హూఁ.'

'ప్యాసు వుందా?'

'ఆమాత్రం అనుకోడా, మనం మౌనంగా ఉంటే, 'అని అనుకున్నా. కాని దగ్గరకొచ్చి టిక్కెట్టు అని మొఖంమీద కళ్ళుపెట్టి అడిగాడు.'

'అప్పుడు ఏంచేశావు?'

'పరధ్యానంగా ఉన్నట్టు నటించేను.'

'తరువాత?

'బేడ ఇచ్చేను. ఎక్కడికని అడిగాడు. చెప్పేను. కాణీ లేదు, తరువాత ఇస్తానన్నాడు.'

'ట్రాంలో నించున్నావా? కూర్చున్నావా?

'కొంతదాకా కూర్చున్నా. గాని ఆడవాళ్ళు ఎవరో వస్తే లేచివాళ్ళ కీచోటు ఇచ్చాను.'

'వా ళ్ళెవ్వరో తెలుసా?'

'తెలేదు.'

'ఎన్ని ఏళ్ళవాళ్ళు?

'వరుసగా ఇరవై రెండు - పద్దెనిమిది.'

'ఇరవై ఏళ్ళ అమ్మాయి ఎలా ఉంది?'

'బాగానే ఉంది.'

'ఏం కులం?'

'కిరస్తానీ. చీరకట్టుకొని ఉంది.'

'ఏ రంగు?

'చాక్ లెట్.'

"ఏ అంచు?"

“ఎర్రంచు.”

“జాకెట్?”

“బుట్ట చేతులది.”

“వీ మెడా?”

“ఊఁ”

“పద్ధెనిమిది వళ్ళపిల్ల?”

“ఊఁ హూఁ-బావు లేదు.”

“ఆ కులమేనా?”

“ఆంగ్లో ఇండియన్ గౌను తొడుక్కుంది- బంతిపువ్వు రంగుది. ఎత్తు మడమల జోళ్ళు తొడుక్కుంది. చేతిసంచీ పట్టుకొంది.”

తొలి అమ్మాయి నవ్వి, రెండోపిల్ల ఎందుకు బావు లేదు?”

‘.........’

“ఇవన్నీ ఎందుకు పరిశీలించేను?”

“నాకు కళ్ళున్నాయి.”

‘ఉంటే?’

‘చూశాను’

‘చూసి?’

‘నాకు మెదడుంది, ఆలోచించాను.’

‘ఆలోచించి?’

‘అనుకొన్నాను.’

‘ఏమని?’

‘తొలిఅమ్మాయి బావుంది అని.’

'ఎలా?'

'నా మెదడులో ఉన్న అరలో ఇమిడింది. అంచేత.'

'ఇంతలో వాళ్ళు దిగిపోయేరు. నే నేంచేశాను?'

'దిగుదా మనుకున్నా.'

'ఎందుకు?'

'వాళ్ళ వెనుకాతల వెళదా మనుకొన్నాను.'

'ఎందుకు?'

'... .......'

'దిగావా?'

'లేదు.'

'ఎంచేత?'

'ప్రస్తుతం ఓ స్నేహితుడిదగ్గరికి వెళ్ళి ఓ మూడురూపాయలు చేబదులు అడుగుదామని బయల్దేరాను. వెళ్ళి అవి సంపాదించుకొంటే కొంతసేపు హాయిగా బతకొచ్చు.'

'ట్రాము వాణ్ణి కాలణా అడిగావా?'

'ఊఁ, అసలు కాణీకి కక్కుర్తి ఎందుకు? పోనీ వాణ్ణే తిననీ అని అనుకొన్నా. కానీ కాణీఇస్తే పాసింగుషో కాల్చుకోవచ్చు.'

'ఇచ్చేడా?'

'ఊఁ, తీసుకొన్నా.'

'ట్రాము దిగేను. నడుస్తున్నా, స్నేహితుడిదగ్గరకి. నేను ఉద్యోగం చేస్తున్నవాణ్ని. ప్రస్తుతం ఓ కాణీ ఆస్తి ఉన్నవాణ్ణి. స్నేహితుడికోసం చేబదులుకోసం నడుస్తున్నాను.